ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు

విశాలాంధ్ర - చెన్నూరు : మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు దుకాణాలను వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు నాగరాజు షాపులను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్స్, ఎరువులు, పురుగుమందులు స్టాక్ ఇన్వాయిస్‌లు ధరల పట్టికలను క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ తప్పనిసరిగా రైతులకు బిల్లులు అందజేయాలని తెలియజేశారు. బిల్లులో రైతు పూర్తి పేరు, మొబైల్ నెంబరు, ఆధార్ నెంబరు పొందుపరచాలి అని తెలియజేశారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువకు అమ్మరాదని, డేటు అయిపోయిన ఎరువులు పురుగు మందులు అమ్మరాదని తెలియజేశారు. ఎంఆర్‌పి కన్నా ఎక్కువ తీసుకున్నచో చట్టపరమైన చర్యలు తీసుకొనబడునని హెచ్చరించారు. మండల వ్యవసాయ అధికారి కె.శ్రీదేవి పాల్గొన్నారు.

పివి నరసింహరావు గొప్ప పరిపాలనాధ్యక్షుడు : తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లె: భారత మాజీ ప్రధాని, స్వర్గీయ పివి నరసింహరావు గొప్ప పరిపాలనాధ్యక్షుడని పీసీసీ మీడియా ఇన్‌చార్జి తులసిరెడ్డి కొనియాడారు. వేంపల్లె కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం పివి నరసింహరావు 102 జయంతి వేడుకలు ఆ పార్టీ నాయకులు నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహరావు చిత్ర పటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం తులసిరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, బహుభాషా కోవిదుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి అని అన్నారు.1991 నుంచి 1999 వరకు ఆరేళ్లపాటు కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడిగా కృషి చేశారన్నారు. కాంగ్రెస్‌పార్టీ తరుపున 20 సంవత్సరాల పాటు శాసన సభ్యుడిగా, రాష్ట్ర మంత్రి, ముఖ్యమంత్రిగా సేవలందించారన్నారు. క్లిష్ట సమయంలో భారత్ ప్రధాన మంత్రి పదవిని చేపట్టారన్నారు. దేశంలో ఆర్థికసంక్షోభం నుంచి రక్షించి అపర చాణక్యుడిగా పేరుతెచ్చుకున్నారన్నారు. దక్షిణ భారతదేశం నంచి తొలి ప్రధాని మంత్రిగా పివి నరసింహారావు కొనసాగారని, ఇది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల అదృష్టమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, చెన్నకేశవ, రామకృష్ణ, బద్రి, ఉత్తన్న, నరసింహారెడ్డి, బాలం సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

జోన్-4 పరిధిలో పలు క్యాడర్లకు పదోన్నతి

విశాలాంధ్ర-కడప : వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్ జూమ్ మీటింగ్ ద్వారా కౌన్సెలింగ్ బుధవారం జరిపారు. జోన్-4 ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నందు ఉమ్మడి నాలుగు జిల్లాల జోన్-4 పరిధిలో సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగులకు ప్రమోషన్ కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగింది. ఇందులో ముఖ్యంగా 4 మంది సినియర్ అసిస్టెంట్స్ నుంచి ఆఫీస్ సూపరింటెండెంట్లు గా పదోన్నతిపై ప్రమోషన్ పొందడం జరిగినది. వారిలో ఇద్దరు కడప జిల్లాలోని జిజిహెచ్ -1, జిఎంసి-1, అనంతపురం జిజిహెచ్-1, కడపలోని ఆర్డీ ఆఫీసులో-1 జూమ్ కౌన్సెలింగ్ ద్వారా పదోన్నతి పొందారన్నారు. నంద్యాల మెడికల్ కాలేజీకి, ఇద్దరు అనంతపురం జిల్లాకు పదోన్నతి పొందారు. ఇందులో ఇద్దరు పదోన్నతి వద్దని తీసుకోలేదు. అలాగే ఇద్దరు సీనియర్ అసిస్టెంట్స్ నుంచి ఆఫీస్ సూపరింటెండెంట్‌లుగా పదోన్నతి పొందారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, ఆఫీస్ సూపరింటెండెంట్ గోపాల్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్లు అథావుల్లా, బత్తినయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ అప్పుల్లో అగ్రగామి: టీడీపీ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : వైకాపా ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో అగ్రగామిగా నిలిపిందని టిడిపి కడప జిల్లా అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరిలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడ్జెట్లో 270 వేల కోట్లు కేటాయిస్తే, ఈ ప్రభుత్వం ఖర్చు చేసింది రెండు లక్షల 30 వేల కోట్లు కాగా, మిగతా 40 వేల కోట్లు ఏమి చేసిందని ఆయన ప్రశ్నించారు. జిఎస్‌టిపి 32. 55 శాతం ఈ ప్రభుత్వం అప్పు చేసిందన్నారు. నీటి ప్రాజెక్టులు, రైల్వే లైన్లు, విద్య, ఆరోగ్యం పై 21. ఒక శాతం ఖర్చు చేసిందన్నారు. కర్ణాటక 1 31 శాతం, నాగాలాండ్ ఎనిమిది వేల కోట్లు, కర్ణాటక 30. ఆరు శాతం వచ్చేస్తే, మన రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం తెచ్చుకున్న అప్పులు సరిపోక ఉద్యోగుల ప్రావిడెంట్ పన్ను, టిఏ డిఏ వాడుకున్న అప్పులని ప్రభుత్వ తీరును తూర్పార పెట్టారు. మద్యం ద్వారా 66 వేల కోట్లు, విద్యుత్తు పెంపు ద్వారా ఆదా యం, ఆర్టీసీ చార్జీల పెంపు ద్వారా 4:30 లక్షల కోట్లు ఈ ప్రభుత్వం ఏమి చేస్తుందని నిలదీశారు. రకరకాల సాకులు చూపి సంక్షేమ పథకాలైన రేషన్ కార్డులు, పింఛన్లు ఎందుకు తొలగించారన్నారు. అన్నా క్యాంటీన్లను రద్దు, పండుగ కానుకలు ఇవ్వక పోగ ప్రజలపై పన్నుల భారం మోపడం ఈ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయిందని, కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తప్పు పట్టిందని, వెంటనే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని ఆర్థిక వ్యవస్థను మెరుగు పరచాలని ఆయన కోరారు.

స్వచ్ఛభారత్ కార్మికులకు జీతాలు వెంటనే విడుదల చేయాలి

విశాలాంధ్ర-గోపవరం : స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 15 నెలల జీతాలను వెంటనే విడుదల చేయాలని బద్వేల్ ఏఐటీయూసీ ఏరియా సహాయ కార్యదర్శి నాగదాసరి ఇమ్మానియేల్ ప్రభుత్వాన్ని కోరారు. స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం బద్వేలు మండల ఎంపీడీవోకి వారి సమస్యలపై వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఇమ్మానియేలు మాట్లాడుతూ సర్పంచులకు 15 ఆర్థిక సంఘం నిధుల నుంచి క్లాప్ మిత్రులకు వేతనాలు చెల్లించాలన్న ప్రభుత్వ ఆదేశాలు క్రింది స్థాయిలో అమలుకు నోచుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 680 ప్రకారం కనీస వేతనం 10000 రూపాయలు ఇవ్వాలని వారికి గుర్తింపు కార్డులు యూనిఫాం పనిముట్లు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. సీఎం సొంత జిల్లాలోనే స్వచ్ఛభారత్ కార్మికులు జీతాలు అందక కుటుంబం గడవక పని భద్రత లేక దుర్భరమైన జీవితం గడపాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు వాపోయారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాలలో ప్రజా ఆరోగ్య రక్షణకై యుద్ధ ప్రాతిపదికన వేతనాలు అందించాలన్నారు లేని పక్షంలో స్వచ్ఛభారత్ కార్మికులను ఏకం చేసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ కార్మికులు ఆనందరావు ఓబయ్య లక్ష్మణ్ గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదరికం విద్యకు ఆటంకం కాకూడదు : డిప్యూటీ సీఎం

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : విద్యకు పేదరికం ఏ మాత్రం ఆటంకం కాకూడదనేదే.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా పేర్కొన్నారు. బుధవారం కడప కలెక్టరేట్ సభాభావన్‌లో "జగనన్న అమ్మఒడి" పథకం ప్రారంభోత్సవానికి రాష్ట్ర ఉపముఖ్య మంత్రి ఎస్.బి.అంజాద్ బాషా, జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజుతో పాటు.. కడప నగర మేయర్ కె.సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డా. దాసరి సుధా, జేసీ గణేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, ఎపి నగర ఉప్పర కార్పొరేషన్ చైర్ పర్సన్ జి.రమణమ్మ, రాష్ట్ర సగర కార్పొరేషన్ చైర్ పర్సన్ జి.రమణమ్మ, ఏపీ చైల్డ్ రైట్ ప్రొటెక్షన్ డైరెక్టర్ లక్ష్మీదేవి, స్థానిక కార్పొరేటర్లు షఫీ, సూర్య నారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మన్యం జిల్లా కురుపాం బహిరంగ సభ నుండి.. ముఖ్యమంత్రి ప్రసంగం ప్రత్యక్ష ప్రసారం ముగిసిన అనంతరం జిల్లాలో "అమ్మఒడి" లబ్ధిదారులయిన 1,80,203 మంది విద్యార్థుల తల్లులకు మంజూరైన మూడవ ఏడాది లబ్ధి మొత్తం రూ.270,30,00,000 ల మెగా చెక్కును ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఉపముఖ్య మంత్రి అంజాద్ బాషా మాట్లాడుతూ.. "ఒక కుటుంబం, ఒక సమాజం.. ఏదైనా సరే వారి తలరాతను మార్చగలిగే శక్తి.. ఒక్క చదువుకు మాత్రమే ఉందని" నమ్మిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎస్ జగన్ మోహన్ రెడ్డి... విద్యారంగంలో వినూత్నమైన మార్పులను తీసుకువచ్చారన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా రాష్ట్రంలో ఏ ఒక్క చిన్నారి కూడా బడికి దూరం కాకూడదనే ఉద్దేశ్యంతో సీఎం జగన్ ఈ పథకానికి రూపకల్పన చేశారన్నారు. వరుసగా నాలుగవ ఏడాది "అమ్మ ఒడి" లబ్ధి మొత్తాన్ని తల్లుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఏ.ఎస్.ఆర్. మన్యం జిల్లాలో ప్రారంభిస్తుండగా.. వైఎస్ఆర్ జిల్లా వ్యాప్తంగా.. ఇక్కడ మనం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు, నగర మేయర్ మాట్లాడుతూ విద్యాదానం అనంతమైనదని, దానం చేస్తున్నకొద్దీ.. విజ్ఞానం పెరుగుతుందని తెలిపారు. ప్రతి తల్లీ పాఠశాలల్లో పేరెంట్ మీటింగ్‌కు తప్పక హాజరయ్యి పిల్లల స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని తల్లులకు సూచిం చారు. సంక్షేమ పథకాలను అమలు చేయడం వరకే ప్రభుత్వ బాధ్యత.. ఆ పథకాల ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రధాన బాధ్యత ప్రభుత్వ అధికారులదే అన్నారు. పిల్లల విద్యాభివృద్ధి కోసం ప్రతి తల్లీ భాగస్వామ్యం కావాల్సి ఉందన్నారు. ప్రతిరోజూ పిల్లల చదువు పర్యవేక్షణ కోసం కొంత సమయం కేటాయించాలని సూచించారు.ఎమ్మెల్సీ రామచంద్రా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న అమ్మఒడి పథకం ద్వారా పేద కుటుంబంలోని ప్రతి చిన్నారికి విద్య అందుతుందని, తద్వారా ఆయా కుటుంబాలు విద్యతోపాటు, ఆర్థికంగా వృద్ధి చెందు తారన్నారు. ఎమ్మెల్యేలు డా.సుధా మాట్లాడుతూ.. విద్యకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చిన ముఖ్యమంత్రి ఎస్.జగన్ మోహన్ రెడ్డి.. ఈ నాలుగేళ్ళలో ఆదర్శ ముఖ్యమంత్రి మాత్రమే కాకుండా.. గొప్ప విద్యావేత్తగా గుర్తింపు పొందారన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేటు పాఠశాలలకు ధీటుగా అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. విద్యారంగంలో సమున్నత మార్పులను తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్య ఆర్జేడీ వెంకట కృష్ణ, డీఈవో రాఘవరెడ్డి, ఎస్.ఎస్.ఏ. పివో డా.ఎ. ప్రభాకర్ రెడ్డి, డిప్యూటీ డిఇఓ రాజగోపాల్ రెడ్డి, విద్యాశాఖ ఎడి దేవరాజు, కడప ఎంఈఓ నారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి: ఏఐటీయూసీ

విశాలాంధ్ర-కడప రూరల్ : కార్మిక సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వంలో ఉన్న సంస్థలను అమ్మడం, అసంఘటిత రంగంలో ఉన్న కార్మికుల హక్కులను హరించే విధంగా చట్టాలు చేస్తున్నాయని ఏఐటీ యూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి, ఆరోపించారు. బుధవారం స్థానిక కడప నగరంలోని హెరాచ్‌మిన్ భవన్ యందు ఏఐటీయూసీ కడప జిల్లా సమితి ఆఫీస్ బేరర్స్ సమావేశం ఏఐటీయూసీ కడప జిల్లా అధ్యక్షులు గుంటి వేణుగోపాల్ అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థలలో స్కీంలలో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు సంవత్సరాల తరబడి అమలుకు నోచుకోకవడం నిర్లక్ష్యాన్ని ఎండగొడుతూ ఆందోళనకు సిద్ధం కావాలని వారు కార్మికులకు పిలుపునిచ్చారు. భారత దేశంలో కార్మికులు పోరాడి సాధించుకొన్న 44 చట్టాలను వాటిని తీసేసి కార్మికుల సంఘం పెట్టొద్దని, పెట్టిన సంఘం చెప్పకుండా సమ్మె చేస్తే దాన్ని రద్దు చేస్తామని, ఎనిమిది గంటల పని విధానంలో 12 గంటలు తీసుకొచ్చి కార్పొరేట్ కంపెనీలకు కార్మికులను బానిసలుగా మార్చే 4లేబర్ కోడ్స్ తీసుకొస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. భారత దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు సంస్థలకు ఇవ్వటానికి వ్యతిరేకంగా కార్మికుల సమరసిల పోరాటాలకు సిద్ధం కావాలని వారు కార్మికులకు వారు పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ కడప జిల్లా డిప్యూటీ సెక్రటరీ కేసి. బాదుల్లా, ఏఐటీయూసీ కడప జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జునరెడ్డి, ఏఐటీయూసీ కడప జిల్లా కార్యదర్శులు ఉద్దె మద్దిలేటి. మస్తాన్, లింగన్న, జిల్లా ఉపాధ్యక్షుడు చాంద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాలలో మెస్ ,కాస్మోటిక్ చార్జీలను పెంచాలి: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి వసతి గృహాలలో మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని ఏఐఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వ రరావు, సిపిఐ రాయచోటి ఏరియా కార్యదర్శి సిద్దిగాల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక రాయచోటి పట్టణంలోని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి సాంఘిక సంక్షేమ శాఖ, వెనుకబడిన తరగతుల వసతి గృహాలలో ఉన్నటువంటి విద్యార్థులకు 2023- 24 విద్యా సంవత్సరానికి కాను పాత మెనూ ను రద్దు చేసి కొత్త మెను ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని అయితే "మెనూ ఏమో ఫుల్లు మెస్ బిల్లు ఏమో నిల్లు" గా ఉందని వారు ఎద్దేవా చేశారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా సొంతభవనాలు లేక పాక్షికంగా దెబ్బతిన్న భవనాలలో ఉంటూ విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వెంటనే వసతి గృహ విద్యార్థులకు శాశ్వత భవనాలను నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాయచోటి నియోజకవర్గ కమిటీ ఎన్నిక: ఏఐఎస్ఎఫ్ రాయచోటి నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులుగా ప్రశాంత్, లోకేష్ లను ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు ,సిపిఐ ఏరియా కార్యదర్శి సిద్దిగల శ్రీనివాసులు తెలిపారు. సహాయ కార్యదర్శిగా లోకేష్, గిరిబాబు, ఖాదరవల్లి ,ఉపాధ్యక్షులుగా వెంకట్ కుమార్, ఓబులేసు, బయన్న లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

పీలేరు ముస్లింలకు టీడీపీ బక్రీద్ శుభాకాంక్షలు

విశాలాంధ్ర-పీలేరు:- పీలేరు మండల, నియోజకవర్గం లోని ముస్లిం సోదరులకు పీలేరు మండల టీడీపీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, పీలేరు నియోజకవర్గం టీడీపీ బీసీ సంఘ అధ్యక్షులు వసంతల రాజ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాటలాడుతు త్యాగాల పండుగ బక్రీద్ పండగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారని తెలిపారు. తమ నేత, జనంమెచ్చిన నేత పీలేరు టీడీపీ నియోజకవర్గం ఇంచార్జి కిషోర్ కుమార్ రెడ్డి పీలేరు ప్రజలకు, పీలేరు నియోజకవర్గం లోని ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారని వారు అన్నారు.

మదనపల్లి జిల్లా ఆసుపత్రిని 350 పడకులకు అప్ గ్రేడ్

విశాలాంధ్ర- మదనపల్లి : మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని 150 పడకల నుండి 350 పడకల ఆస్పత్రిగా అప్గ్రేడ్ చేసి మేటర్నిటీ ఆసుపత్రిగా తీర్చిదిద్దుతామని ఏపీఎంఎస్ఐడిసి ఎండి మురళీధర్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన విజయవాడ నుంచి వచ్చిన పలువురు అధికారులతో కలసి బుధవారం మదనపల్లి మండలంలోని ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల, మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీచేశారు. విజయవాడ నుంచి మదనపల్లికి వచ్చిన ఆయన మొదట ఆరోగ్యవరం మెడికల్ కాలేజీ, జిల్లా ప్రభుత్వ అసుపత్రి భవన నిర్మాణాలను పరిశీలించారు. అస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. ప్రస్తుత 150 పడకల అస్పత్రిని మరో 200 పడకలుగా పెంచి, మొత్తం 350 పడకల మెటర్నిటీ అసుపత్రిని చేస్తామని మురళీధరరెడ్డి మీడియాకు తెలిపారు.

చాలీచాలని వానలు - పదునెక్కని పంటపొలాలు

అదునుదాటుతున్నా తడవని నేలలు- దుక్కులుదున్ని దిక్కులు చూస్తున్న రైతులు

విశాలాంధ్ర-వేంపల్లె: ఒక వైపు చాలీచాలని వానలు.. పదునెక్కని పంటపొలా లు.. అదునుదాటుతున్నా తడవని నేలలు.. కర్పూరంలా కరుగుతున్న మేఘాలు.. మరోవైపు దుక్కులుదున్ని దిక్కులు చూస్తున్న రైతులు.. ఇదీ నేటి ఖరీఫ్ పరిస్థితి. మరోవైపు ప్రభుత్వం రాయితీపై విత్తనకాయలు పంపిణీ ప్రక్రియ పూర్తిచేయడం.. అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచడం వెరసి నిరాశపరస్తున్న ఖరీఫ్, జూన్ చివరివారం కూడా ముగుస్తున్నా నైరుతీ రుతుపవనాల ప్రభావం ఏమాత్రం కనిపించలేదు. ఎండాకాలంలో వానలు వానాకాలంలో ఎండలు ప్రస్తుత వాతావ రణంలో వచ్చిన మార్పులు గమనిస్తే ప్రకృతి కూడా రైతన్నలకు సహకరించలేదు. ఈ దఫా రుతుపవనాల ఆగమనం ఆలస్యమవుతుందని వాతావరణ శాఖ అధికారులు చెప్పిన వాస్తవాలు నిజమవుతున్నాయి. ఏరువాక సేద్యాలకు సహకరించిన వానలు విత్తు సమయం వచ్చే సరికి మటుమాయమయ్యాయి. ఖరీఫ్ సమయం అరుదెంచినా అందుకు తగ్గ ఫలితం కనిపించలేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఏటా జూన్‌లో ప్రవేశించాల్సిన నైరుతీ రుతుపవనాలు ఈ దఫా మందగించాయి. అదునుదాటున్నా చినుకు జాడలేకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఖరీఫ్‌లో అన్ని అనుకూలిస్తే ప్రధాననంటగా వేరుశనగ సాగిస్తారు. ఆదాయ వ్యయాలు ఎలా ఉన్నా కనీసం పశుగ్రాసం కోసమైనా వేరుశనగ తప్పని సరిగా సాగిస్తారు. గతకొంత కాలంగా ఖరీఫ్‌లో ప్రకృతి సరిగ్గా సహకరించలేదు. ఒకవేళ సహకరించినా వేరుశగన పట్ల రైతులు మొగ్గుచూపలేదు. గత ఐదారేళ్ళుగా ఖరీఫ్‌లో వేరుశనగ సాగించాలంటే రైతులు జంకుతున్నారు. ఒక విపరీతమైన ఖర్చురావడం, ఊడలు దిగి పిందెవసే సమయానికి వైరస్ సోకడం, లేదా దిగుబడికి సరైన గిట్టుబాటు ధర లభించకపోవడం ఇత్యాది కారణాల వల్ల వేరుశనగసాగు విస్తీర్ణం తగ్గిపోతుందని రైతులు వెల్లడించారు. కాగా జులై ఆఖరు వరకు వేరుశనగసాగుకు అదునుగా రైతులు భావిస్తారు. ఇంకా నెలరోజు వ్యవధి ఉంది. ఈ లోపు పదును వర్షాలు వస్తాయని రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. వర్షాలు వచ్చినా ఖరీఫ్‌లో వేరుశనగసాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గే అవకాశం ఉందని రైతులు సూచనప్రాయంగా చెబుతున్నారు. గతంలో పులివెందుల నియోజకవర్గ పరిదిలో లక్షా 20వేల నుంచి 50వేల వరకు వేరుశనగ సాగయ్యేది. ఈ దఫా ఇందులో సగభాగం కూడా సాగయ్యే అవకాశాలు కల్పించలేదు. ఏది ఏమైనా ఖరీఫ్‌లో సర్వం ఎదురొడ్డి పోరాడుతున్న రైతులకు ప్రకృతి అన్ని విధాలా సహకరించాలని ఆశిద్దాం.

టీడీపీకి మాలల గురించి మాట్లాడే అర్హత లేదు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : తెలుగుదేశం పార్టీ కానీ అధినాయకుడు చంద్రబాబు కానీ మాలల గురించి మాట్లాడే అర్హత లేదని వైఎస్ఆర్సిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు సిహెచ్ వినోద్ కుమార్ అన్నారు. బుధవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిన్నటి దినమున తెలుగుదేశం పార్టీ మాలయ మాలల ఆత్మీయ సభ నిర్వహించడం జరిగిందన్నారు. అసలు తెలుగుదేశం పార్టీకి మాలల గురించి మాట్లాడే అర్హత టీడీపీకి లేదన్నారు. ఎందుకంటే ఎప్పుడు కూడా మాలలు ఒక శత్రువుగా చూసిన పార్టీ ఏదైనా ఉందంటే అది ఒక తెలుగుదేశం పార్టీ మాత్రమే అని ఈ సందర్భంగా నేను తెలియజేస్తున్నాను. అసలు తెలుగుదేశం పార్టీ చంద్రబాబు నాయుడు చేతికి వచ్చినప్పటి నుంచి ఇప్పుడు కూడా మాలల గురించి అభివృద్ధి గురించి మాట్లాడిన రోజు ఎప్పుడు లేదు కానీ ఇప్పుడు మాల ఆత్మ ఆత్మీయ సభని నిర్వించి మాలల పైన ప్రేమ ఉంటే ఈ సభకు హాజరయ్యేవాడు చంద్రబాబు నాయుడు కానీ ఈ మీటింగ్ కూడా చంద్రబాబు హాజరు కాలేదంటే మాలల పైన ఎంత ప్రేమ ఉందో ఈ యొక్క సభ ఒక నిదర్శనం వీళ్లు మాల ల గురించి ఆత్మీయ సభ పెట్ట అర్హత ఉందా అని నేను అడుగుతున్నాను. 1999లో అప్పటి చంద్రబాబు నాయుడు మాలలో మాదిగలు వేరువేరుగా చూస్తూ కుల ద్విక్రం పత్రంలో కూడా ఏబీసీడీలు వర్గీకరణ పెట్టి మాలలో చిన్నచూపు చూడడం జరిగింది. ఈరోజు ఎలక్షన్లు వస్తున్నాయని చెప్పి మాలలపైన ఎక్కడలేని ప్రేమ వలకబోస్తూ ఈరోజు నాయకుల చేత మీటింగ్ పెట్టడం జరిగింది. నేను ఒకటే చెబుతున్నా చంద్రబాబు నాయుడుకి 2004 రాజశేఖర్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే మాలలు మాదిగలు ఇద్దరు ఒకటే నాకు సమానత్వము సమానమని చెప్పి ఎబిసిడి వర్గీకరణ తీసేసి అందర్నీ రెండు కళ్ళు లాగా చూసిన వ్యక్తి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అలాంటి కుటుంబానికి ఎప్పుడు కూడా మాల అందరూ కూడా వెన్నంటు ఉండి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజార్టీతో మాల అందరూ కూడా పార్టీలకతీతంగా ఎవ్వరైతే ఎలక్షన్‌లో దళిత ఎమ్మెల్యేగా నిలబెడతారో అక్కడ దళితులు అందరూ కూడా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిలబెట్టిన అభ్యర్థులపై విజయం సాధించేంత వరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వెన్ను దున్నంగా ఉంటారని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. మన దేశంలో 29 రాష్ట్రాలకు గాను ఏ ఒక్క ముఖ్యమంత్రి మాలలకు మూడు మంత్రి పదవులు ఒక డిప్యూటీ సీఎం ఒక మండలి చైర్మన్ ఒక ఎస్సీ కమిషన్ చైర్మన్ చేసిన ఘనత ఒక ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ మాత్రమే దక్కింది అటువంటి ముఖ్యమంత్రిని మాల అందరు కూడా జగన్మోహన్ రెడ్డికి మరొకసారి ముఖ్యమంత్రి చేసేంతవరకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఈ సమావేశంలో వైయస్సార్ టియుసి జిల్లా అధ్యక్షుడు జాషువా, వైఎస్ఆర్ కాంగ్రెస్ దళిత నాయకులు లక్ష్మీనారాయణ, నరసింహ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సంపత్ పాల్గొన్నారు.

వైవీయూ డిగ్రీ పరీక్షల అకస్మిక తనిఖీ చేసిన వీసీ

విశాలాంధ్ర-కడప వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలో ఈనెల 23వ తేదీ నుంచి జరుగుతున్న డిగ్రీ పరీక్షలను విశ్వవిద్యా లయ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్, వైవియు పరీక్షల నిర్వహణ అధికారి ఆచార్య ఎస్.ఈశ్వర రెడ్డితో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం కడప నగరంలో ఉన్న నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల, శ్రీహరి డిగ్రీ కళాశాల, వివేకానంద మహిళా డిగ్రీ కళాశాల, స్పిరిట్ డిగ్రీ కళాశాల, శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాలను సందర్శించారు. విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. సౌకర్యాల గురించి వాకబు చేశారు. పరీక్ష కేంద్రంలోని వసతులను, మరుగుదొడ్లను గమనించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించాలని ఎలాంటి, అనుమానాలకు తావివ్వకూడదని పరీక్షా కేంద్రాల అధికారులకు సూచించారు. ఓబుల వారిపల్లి, ఒంటిమిట్ట, రాజంపేట, కోడూరులో జరుగుతున్న డిగ్రీ పరీక్ష కేంద్రాలు పూర్వపు కుల సచివులు ఆచార్య విజయ రాఘవ ప్రసాద్, వైవియు పరీక్షల నిర్వహణ అధికారి ఆచార్య ఎస్.ఈశ్వర రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ పరిధిలో 57 కేంద్రాలలో పరీక్షలు మొదలయ్యాయన్నారు. 42,300 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు.

బదిలీలపై వెళుతున్న సీనియర్ అసిస్టెంట్లకు ఘన సన్మానం

విశాలాంధ్ర - కడప : కడప నగర శివారు లోని ప్రభుత్వ మెడికల్ కళాశాల (రిమ్స్) నందు సాధారణ బదిలీలపై వెళుతున్న సీనియర్ అసిస్టెంట్లకు ఘనసన్మానం చేశారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో డాక్టర్ సురేఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీపై వెళుతున్న సీనియర్ అసిస్టెంట్లు మెడికల్ కళాశాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశారన్నారు. వీరి స్థానంలో భర్తీ అయిన సీనియర్ అసిస్టెంట్లు వాళ్ల విధంగానే కృషి చేయాలన్నారు. మెడికల్ కళాశాల అభివృద్ధికి కృషి చేయాలని కోరుకుంటున్నాను. కార్యక్రమంలో కళాశాల వయసు ప్రిన్సిపల్ డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ శ్రీనివాస్ నాయక్, ఆఫీస్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు,సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలి: ఏఐటీయూసీ

విశాలాంధ్ర-మదనపల్లి: బుధవారం ఏఐటీయూసీ మదనపల్లి పట్టణ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాంబశివ కృష్ణప్ప మాట్లాడుతూ మదనపల్లి అర్బన్‌లో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు లెప్రసీ సర్వే డబ్బులు అలాగే లెప్రసీ ట్రైనింగ్ డబ్బులు రాలేదని మదనపల్లి డిప్యూటీ డిఎంహెచ్ఓ ఆశా కార్యకర్తలు రామారావు కాలనీ యుపిహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ పై ఫిర్యాదు చేశారని కారణంతో మంగళవారం సాయంత్రం మదనపల్లి అర్బన్‌లో ఉన్న ఏఎన్ఎమ్స్ ఆశా కార్యకర్తలను అందరినీ రామారావు కాలనీ యూపీహెచ్సీ కి పిలిపించి అక్కడ ఆశా కార్యకర్తలను బెదిరించడం జరిగిన సంఘటనపై జిల్లా డిఎంహెచ్ఓ విచారణ జరిపించాలని కోరారు. మంగళవారం సాయం త్రం రామారావు కాలనీ యూపీహెచ్సీ లో మెడికల్ ఆఫీసర్ ప్రవర్తించిన తీరుపై ఉన్నత స్థాయి అధికారులు విచారణ జరిపించి, మెడికల్ ఆఫీసర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మదనపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు రెడ్డప్ప,సహాయ కార్యదర్శి ముభారక్, ఏఐటీయూసీ మదనపల్లి పట్టణ అధ్యక్షుడు రవి, భాస్కర్ యాదవ్, వెంకటేష్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలు సత్వరం పరిష్కరించాలి: జేసీ

విశాలాంధ్ర-పీలేరు: సచివాలయాలకు వచ్చే అర్జీదారుల పట్ల మర్యాదపూర్వకంగా మెలుగుతూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నమయ్య జిల్లా జేసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సచివాలయం ఆదేశించారు బుధవారం పీలేరు మండల పరిధిలోని ముడుపుల వేముల, వేపుల బైలు సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు ఏ ఏ సమస్యలపై ఎక్కువగా అర్జీదారులు సచివాలయాలకు వస్తారని సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభమైంది కనుక విద్యార్థులు అడ్మిషన్లు జరుగుతున్నందున వారికి కుల ధ్రువీకరణ ఆదాయం సర్టిఫికెట్లను ఎప్పటికప్పుడు అందజేయాలని తెలియజేశారు అనంతరం పీలేరు పరిధిలోని బోడుములవారిపల్లి రెవెన్యూ గ్రామంలో ఎన్హెచ్ 71 రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి భూ సేకరణ కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు ఎన్ హెచ్ రోడ్డుకు పోతున్న భూసేకరణ భూముల కు సంబంధించిన రికార్డులను రైతుల నుంచి తెప్పించుకొని తప్పొప్పులకు తావివ్వకుండా సక్రమంగా రికార్డులను నమోదు చేయాలని తాసిల్దార్ ఆదేశించారు, ప్రభుత్వం నుంచి న్యాయమైన పరిహారం అందజేస్తామని అక్కడికి వచ్చిన రైతులకు జేసి తెలియజేశారు . ఈ పర్యటనలో జెసి వెంట తహసిల్దార్ సర్వేయర్లు విఆర్వోలు సిబ్బంది ఉన్నారు.

బదిలీ, ప్రమోషన్‌పై వెళ్ళిన ఉపాధ్యాయులకు సన్మానం

విశాలాంధ్ర-పీలేరు: స్థానిక మండలంలోని జంగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు బుధవారం బదిలీ, ప్రమోషన్ పై వెళ్ళిన ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం జరిగింది.ఈ కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు పి.రెడ్డెప్ప బదిలీపై తలుపుల ఉన్నత పాఠశాలకు, పి.చంద్రమౌళి స్కూల్ అసిస్టెంట్ పిఈ గా పదోన్నతిపై కలిచర్ల జడ్పీ ఉన్నత పాఠశాల(తెలుగు)కు మరియు కే.లీలావతి బదిలీ పై వాయల్పాడు ప్రధాన ప్రాథమిక పాఠశాల ఎల్.ఎఫ్.ఎల్ ప్రధానోపాధ్యాయులుగా వెళ్ళిన సందర్భంగా జంగంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి గంగాధరం అధ్యక్షతన ఘనంగా సన్మానం జరిగింది. వారి సేవలను పలువురు వక్తలు కొనియాడారు. పై కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరీఫ్,రేణుక,బి.వి రమణ, ఎస్.రమణయ్య, ఆనందరాజు, ఏ.అశోక్ కుమార్, మగ్బూల్ ఫారూఖ్, రామ్మూర్తి, టిపీ రమణ, పాఠశాల కమిటీ చైర్మన్ ఎస్.వీరయ్య, వైస్ చైర్మన్ అంజన కుమారి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
వైఎస్ఆర్ కడప జిల్లా



సీఎం జిల్లా పర్యటనను విజయవంతం చేయండి: కలెక్టర్

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జులై నెల మొదటి వారంలో మూడు లేదా నాలుగు రోజుల పాటు జిల్లాలో పర్యటించే అవకాశం ఉంది. అయితే ఇంకా అధికారికంగా మినిట్ టు మినిట్ అందాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా అధికారులందరు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని.. జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు జిల్లా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు రానున్న సందర్భంగా బుధవారం కలెక్టరేట్ స్పందన హాలులో ముందస్తు ఏర్పాట్లపై.. ఎస్పీ అన్బురాజన్, జేసి జి.గణేష్ కుమార్, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్వో గంగాధర్ గౌడ్, డిఎఫ్ఓ సందీప్, డిఆర్వో గంగాధర్ గౌడ్, పడ ఓఎస్డి అనిల్ కుమార్ రెడ్డిలతో కలిసి జిల్లా అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి జిల్లా అధికారులకు వివిధ బాధ్యతలను అప్పగించడం జరిగిందన్నారు. జూలై మొదటివారంలో కడప, ఇడుపులపాయ, కొప్పర్తి, పులివెందుల, గండికోటలలో జరిగే ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా ప్రణాళికా బద్దంగా గట్టి ఏర్పాట్లు చేయాలని విధులను కేటాయించిన అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో.. కడప, జమ్మలమడుగు, బద్వేలు, ఆర్డీవోలు ధర్మచంద్రా రెడ్డి, శ్రీనివాసులు, వెంకటరమణ, డిఆర్డీఏ పీడి ఆనంద నాయక్ , సిపివో వెంకట రావు, ఆర్అండ్‌బి ఎస్ఈ మహేశ్వర రెడ్డి, ఎస్సి కార్పొరేషన్ ఈడీ వెంకట సుబ్బయ్య, డీపీవో ప్రభాకర్ రెడ్డి, సిపివో వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు కంది విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర-చెన్నూరు : జాతీయ ఆరోగ్య భద్రత మిషన్ క్రింద చెన్నూరు మండలానికి ఖరీఫ్ 2023 కు కంది పంట ఎల్ఆర్‌జీ - 52 రకము ఒక క్వింటాల్ మినీ కిట్స్ పంపిణీ చేయడం జరిగిందని మండల అధ్యక్షుడు చీర్ల సురేష్ యాదవ్, మండల రైతు సంఘం అధ్యక్షుడు ఎర్రసాని మోహన్ రెడ్డి లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్కొక్క మినీ కిట్లో నాలుగు కేజీల విత్తనాలు ఉంటాయన్నారు. ఒక రైతుకు ఒక మినీ కిట్ 100% సబ్సిడీతో ఇవ్వబడుతుం దన్నారు. ఈ రకము 150 నుంచి 160 రోజుల్లో కోతకు కోతకు వస్తుందని, కందిని అంతర పంటగా, సూటి పంటగా మరియు వరిగట్ల మీద వేసుకొనవచ్చునని అన్నారు.వీరి చేతులు మీదగా చిన్నమాచపల్లి ముండ్లపల్లి రైతులకు మినీ కిడ్స్ అందజేయడం జరిగినది. పంట పండించడానికి ఆసక్తి ఉన్న రైతులు రైతు భరోసా కేంద్రాలను సంప్రదించవలెనని వ్యవసాయ అధికారి శ్రీదేవి పేర్కొన్నారు.

అకాల వర్షాలకు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి

విశాలాంధ్ర-వేంపల్లె: గత మార్చి, మేనెలలో కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న రైతులను వెంటనే ఆదుకోవాలని టీడీపీ రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టరు షబీర్, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు అన్నారెడ్డి బాలస్వామిరెడ్డిలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ వేసవిలో కురిసన అకాల వర్షాలకు సాగులో ఉన్న అన్ని రకాల పంటలలో కేవలం అరటి, మామిడి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేయడం వల్ల మిగతా పంటలు వేసి నష్టపోయిన రైతులు బాధపడుతున్నారన్నారు. జగన్‌రెడ్డి అధికారం చేపట్టిన ఈ నాలుగేళ్లలో చాలా సార్లు అకాల వర్షాలు వచ్చాయని, ఈ వర్షాల వల్ల రైతులు అపారంగా నష్టపోయారని వారు ఆవేదన వ్యక్తంచేశారు. అరకొరగా వచ్చిన దిగుబడికి గిట్టుబాటు ధర లభించని కారణంగా రైతులు నష్టాలో ఊబిలో చిక్కుకు పోయారని వాపోయారు. ఇప్పటికైనా అటు ప్రకృతి వైపరీత్యాలు ఇటు అకాల వర్షాలకు దెబ్బతిన్న రైతులందరికి వెంటనే పరిహారం అందిస్తూ వారిని ప్రత్యామ్నాయంగా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఆ దిశగా జగన్‌రెడ్డి రైతులను ఆదుకోవాలని వారు కోరారు.

కుష్ఠ నివారణే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర-వేంపల్లె: కుష్టు వ్యాధి నివారణే ప్రభుత్వ ధ్యేయమని డాక్టరు లిఖిత, డీపీఎమ్ఓ సుబ్బారెడ్డిలు అన్నారు. పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లి పీహెచ్‌సీ పరిధిలోని కుష్టుపై చేపట్టిన ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని బుధవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే నెల 16వ తేదీ వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ సర్వేలో కుష్టువ్యాధి లక్షణాలు గుర్తిస్తామన్నారు. కుష్టు లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే వారికి వైద్యం అందిస్తామన్నారు. కుష్టు నివారణకు ప్రభుత్వ ఉచితంగా మందులను అందిస్తుందన్నారు. కావున కుష్టు నివారణకు చేపట్టిన సర్వేకు అందరూ సహకరించాలని వారు కోరారు.

ఈశ్వరిదేవి ఆలయంలో హుండీ లెక్కింపు

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన శ్రీజగన్మాత ఈశ్వరి దేవి ఆలయం నందు భక్తులు కానుకల రూపంగా ఈశ్వరిదేవి అమ్మవారికి కానుకలను సమర్పించుకోవడంతో హుండీలను లెక్కించగా 4నెలల, 4హుం డీలను లెక్కించగా రూ.4 లక్షల 79వేల 174 వచ్చినట్లుగా దేవస్థానం కార్యనిర్వాహకుల అధికారి బివి జగన్మోహన్ రెడ్డి తెలిపారు. ఈ హుండీలను మఠాధిపతులు శ్రీశ్రీ వీరశివకుమార్ స్వామి ఆధ్వర్యంలో రాజంపేట తనిఖీ అధికారి శివయ్య, భక్తులు సమక్షంలో లెక్కించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల వంటకాలే శ్రేయస్కరం

విశాలాంధ్ర-లింగాల: మనిషి ఆరోగ్యానికి చిరుధాన్యాల వంటకాలే మిక్కిలి శ్రేయస్కరమని ఫుడ్‌టెక్నాలజీ కళాశాల అసి స్టెంటు ప్రొఫెసర్ జయమ్మ అన్నారు. అంతర్జాతీయ చిరుధా న్యాల సంవత్సరం పురస్కరిం చుకుని బుధవారం పులివెందుల పట్టణ పరిధిలోని బ్రాహ్మణ పల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో వివిధ రకాల చిరుధాన్యాలను ఉపయోగించి మల్టీగ్రైన్ మిల్లెట్ మాల్టును తయారు చేసే పద్ధతులపై ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో ఆమె మాట్లాడుతూ శరీరంలో పోషకాలు లోపిస్తున్న నేపథ్యంలో ఆహారధాన్యాలతో తయారు చేసిన వంటకాలు ఎంతో మేలు కలిగిస్తాయన్నారు. మల్టిగ్రైన్ మిల్లెట్‌ను ఎలా తయారు చేయాలో ప్రయోగాత్మకం గా విద్యార్థులకు విశదీకరించారు. కార్యక్రమంలో ఎస్ పావనదీప్తి, రామిరెడ్డి పాల్గొన్నారు.

ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాం

దివంగత వైఎస్ కృష్ణా జలాలను గండికోటకు తెప్పిస్తే వాటిని ఉప్పలూరుకి తేవడం జగనన్న ఘనతే: ఎంపీ అవినాష్

విశాలాంధ్ర-యర్రగుంట్ల : జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ముద్దనూరు మండలం కాండ్లోపల్లె గ్రామ సమీపంలో గాలేరు-నగరి సుజల ప్రవంతి ప్రధాన కాలువ నుండి ఆకుతోటపల్లె చెరువు, ఉప్పలూరు చిన్నచెరువులకు కడప పార్లమెం టు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి నీటిని విడుదల చేశారు. ఎత్తిపోతల పథకం కింద నీటిని మళ్లించడం జరిగింది. రెండు చెరువులకు నీరు విడుదల చేయడంతో ఆయా ప్రాంతాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఎంపీ అవినాష్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి నెరవేర్చారని గుర్తుకు తెచ్చారు. నాలుగేళ్లలో 99శాతం హామీలను నెరవేర్చిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గండికోటకు కృష్ణా జలాలను తెప్పిస్తే వాటిని ఉప్పలూరు వరకు జగనన్న తేవడం సంతోషం కలిగిస్తోందన్నారు. అన్ని విధాలుగా మేలులు చేసిన వైసీపీ ప్రభుత్వానికి జరగనున్న ఎన్నికల్లో బాసటగా నిలవాలని ఆయన అభ్యర్థించారు. అంతకుముందు గొరిగెనూరు గ్రామంలో నూతన సచివాలయ భవనాన్ని, ధర్మాపురం గ్రామంలో వాటర్‌ప్లాంటును వీరు ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో ముద్దనూరు ఎంపీపీ కె.ప్రదీప్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డి, ఎర్రగుంట్ల మున్సిపల్ చైర్మన్ మూలె హర్షవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర హార్టికల్చర్ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

యజ్ఞశ్రీ నేత్రదానం

విశాలాంధ్ర-వేంపల్లె: వేముల మండలం వేల్పుల గ్రామానికి చెందిన చిన్నారి యజ్ఞశ్రీ నేత్రదానం చేశారు. యజ్ఞశ్రీ మరణించిన విషయాన్ని చిన్నారి తల్లిదండ్రులు ప్రాంతీయ ఆసుపత్రి స్టాఫ్ నర్స్ లత, నాక్ బిల్డింగ్ సీనియర్ డెమో రమేష్. జేజెమ్మ భారతి, పెద్దనాన్న మహేష్, పెద్దమ్మ జ్యోతి, బాబాయ్ ఉమేష్, పిన్ని అనిత, మేనమామలు అత్తలులు అనిల్ శ్రాణి, శివమోహన్, అరుణలు నేత్రదానానికి అంగీకరిస్తూ ఆ మేరకు స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజుకు కబురు పంపారు. ఇందుకు స్పందించిన రాజు, నేత్రనిధి టెక్నీషియన్ హరీష్‌తో కలిసి వేల్పుల గ్రామం వెళ్లి అక్కడ యజ్ఞశ్రీ పార్థికశరీరం నుంచి కార్నియాలను సేకరించారు. వాటిని హైదరాబాద్ అగర్వాల్ ఆసుపత్రికి పంపినట్లు రాజు వెల్లడించారు. రాజు మాట్లాడుతూ నేత్రదానినికి వయసు పరమిమితలేదన్నారు. కుటుంంలోని వ్యక్తి మరణించినప్పుడు శోకంలో ఉండి కూడా మనసు నిబ్బరం చేసుకుని నేత్రదానం చేయాలన్న సంకల్పంతో అంధత్వ నివారణకు నేత్రదానికి అంగీకారం తెలిపాలని కోరా రు. కార్ని యాలను దానం చేయాలనుకునే వారు 9966509364 లేదా 70920 4537 సెల్ నంబర్లను సంప్రదించాల్సిందిగా రాజు కోరారు. కార్నియాలను దా నం చేసేందుకు సహకరించిన యజ్ఞశ్రీ కుటుంబసభ్యులకు అభినందనలు తెలిపారు.

దళితులంతా జగనన్న వెంటే

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : రాష్ట్ర రాజకీయాలలో ఆది నుంచి యస్సి ఎస్టీ కులాలను అపహాస్యం చేస్తూ దళితులలో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా, యస్సిలు మీకెందుకు రా చదువులు, అంటూ హేళన మాటలు మాట్లాడిన చంద్ర బాబు అండ్ కో ఇపుడు ఓట్ల కోసం మాల ఆత్మీయ సమావేశం మాదిగల ఆత్మీయ సమావేశం అంటూ నాటకాలు ఆడడం ప్రజలు అందరూ గమనిస్తున్నారు. దళిత ద్రోహిగా చంద్రబాబును సమాజం ఏనాడో గుర్తించింది. గతంలో 1997లో పి.వి. రావు చలో అసెంబ్లీ పిలుపు ఇస్తే మాలలను గుర్రాలతో తొక్కించి 5గురు ప్రాణాలు పోవడానికి కారణం చంద్రబాబు. బాబు హయంలో దళితులపై దాడులలో ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్‌గా యన్‌సి ఆర్‌బి నివేదిక ఇచ్చింది. రాష్ట్రంలో దళిత కుటుంబాలు అన్ని తమను ఆదరించే నాయకులు సీఎం జగన్మోహన్ రెడ్డి అని ఆయన ప్రోత్సాహం వలన నేడు దళితులు పారిశ్రామిక వేత్తలుగా ఎదుగుతున్నారని దళితులకు కేబినెట్‌లో అగ్ర స్థానం ఇచ్చారని మాల మాదిగలను తన రెండు కళ్ళలా అభివర్ణించిన ముఖ్యమంత్రి జగనన్నతోనే దళితుల అభివృద్ధి సాధ్యం. టిడిపి నాయకులు అచ్చెన్నాయుడు అంటున్నట్లు గా మాలలు గత ఎన్నికల్లో గంపగుత్తగా వైస్సార్సీపీకి ఓట్లు వేశారని ఇపుడు కూడా మాలలు జగనన్నకు గంపగుత్తగా ఓట్లు వేసి గెలుపుంచుకుంటారని టిడిపిని నమ్మే పరిస్థితిలో మాలలు లేరని వైస్సార్సీపీ దళిత నాయకులు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పల్లెకొండు సంపత్, 1వ డివిజన్ కార్పొరేటర్ చెన్నయ్య, మహిళా నాయకురాలు చైతల్య తెలిపారు.

జగనన్న సురక్షతో అర్హులకు న్యాయం



విశాలాంధ్ర-పోరుమామిళ్ల : జగనన్న సురక్షతో పథకాలు అందని అర్హులకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సచివాలయాల మండల కన్వీనర్, సర్పంచుల సంఘం మండల అధ్యక్ష్యులు కల్లూరు రమణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని టేకురుపేట, తిమ్మరెడ్డిపల్లె, యాగ్రసాల, కవలకుంట్లల లో బుదవారం సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు, సిబ్బం దికి జగనన్న సురక్ష కార్యక్రమంపై శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిధులుగా రమణారెడ్డితో పాటు తహసిల్దార్ గంగన్న, ఎంపిడిఓ చంద్ర మౌలుస్వర్ పాల్గొ న్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంటిని సర్వే చేసి పథకాలు అందని లబ్ది దారులను గుర్తించి కారణాలు తెలుసు కావాలన్నారు. తదుపరి వారికి అవసరమైన సర్టిఫికెట్ల ను సచివాలయంలో దరఖాస్తు చేయాలన్నారు. సర్టిఫికెట్లను క్యాంప్ రోజు అధికారులు వారికి అందజేస్తారు అని చెప్పారు. అర్హులు నష్టపోకుండా సర్వే చేయాలని సూచించారు.

అజెండాలోని అన్ని అంశాలు ఏకగ్రీవ తీర్మాణం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో పొందుపరిచిన 25అంశాలను మున్సిపల్ చైర్మెన్ భీమునిపల్లె లక్ష్మిదేవి నాగరాజు ఏకగ్రీవంగా తీర్మాణించారు. బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశానికి మున్సిపల్ చైర్మెన్ బి.లక్ష్మిదేవి నాగరాజు అధ్యక్షత వహించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ సభ్యులందరి ఏకగ్రీవ తీర్మాణంతో అజెండాలోని అన్ని అంశాలను ఆమోదించడం జరిగిందన్నారు. ఈ కౌన్సిల్ సమావేశాన్ని ఉద్దేశించి 13వ వార్డు కౌన్సిలర్ ఎస్.ఇర్ఫాన్ మాట్లాడుతూ పట్టణంలోని తన వార్డులో గత నాలుగు సంవత్సరాల నుంచి నాలుగు అంతస్థుల భవణాన్ని నిర్మిస్తున్నారని, దీనిపై మున్సిపల్ అధికారులు ఎవ్వరు చర్యలు చేపట్టడం లేదని అన్నారు. పట్టణంలో అక్రమ కట్టడాలు పెరిగిపోతున్నాయని అయిన మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అక్రమ కట్టడంపై మున్సిపల్ కమీషనర్ దృష్టికి తీసుకువస్తున్నప్పటికి చర్యలు లేవన్నారు. ఈ అంశంపై కమీషనర్ స్పందిస్తూ ఈ అంశాన్ని పరిశీలించామని, రీడింగ్, డబుల్ ట్యాక్స్ కూడ వేశామన్నారు. ఈ అంశంపై కోర్టుకు పోవడంతో కోర్టు తీర్పు కోసం ఎదురు చూస్తున్నామన్నారు. మున్సిపల్ చట్ట పరిధిలో ఏం చర్యలు తీసుకోవాలో అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అక్రమ కట్టడాలపై ఉపేక్షించేది లేదని ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమీషనర్ సభలో తెలిపారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మం డల పరిధిలోని మల్లెపల్లె పంచాయతీలో ఉన్న చెంచయ్యగారి పల్లె గ్రామంలో ఓబుగాని నరసింహులు కుమారుడు నరసింహులు మూడున్నర ఎకరా పొలం సాగు చేస్తూ పంట నష్టం జరగడంతో అప్పుల బాధ తట్టుకోలేక విశ్రావం తాగి మృతి చెందినట్లుగా కుటుంబసభ్యులు తెలిపారు. ఇటీవలనే మూడున్నర ఎకర పంట సాగులో ఉంటూ పంట చేతికి రాకపోవడంతోనే పురుగుల మందు త్రాగి నట్లుగా కుటుంబసభ్యులు తెలపడంతో హుటాహుటీనా ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స మేరకు తరలించగా అప్పటికే నరసింహులు మృతి చెందినట్లుగా తెలపారు. మృతి చెందిన ఓబులేసుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఓబులేసు చనిపోవడంతో అనాథలుగా మారారు. ప్రభుత్వం కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు తెలిపారు. ఈ మేరకు సమాచారం అందుకున్న బి.మఠం పోలీసులు విచారణ చేపట్టి కేసు నమోదు చేశారు. మృత దేహానికి స్థానిక సర్పంచ్ చిలమల్ల లక్ష్మిదేవి భర్త నారాయణయాదవ్ కుటుంబాన్ని పరామర్శించి వారికి తెలుగుదేశం పార్టీ అండదండటు ఉంటాయని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు సుబ్బారెడ్డితో పాటు పలువురు టీడీపీ నాయకులు కుటుంబానికి సానుభూతి తెలిపారు.

రాష్ట్ర లిడ్ కాప్ కార్పొరేషన్ డైరెక్టర్‌కు ఘన సన్మానం

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : కడప జిల్లా పులివెందులలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లిడ్ కాప్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆర్.కృష్ణమూర్తిని ఆయన కార్యాలయంలో బద్వేల్ చర్మ కార్మికుల సంస్థ ప్రెసిడెంట్ మున్నేల్లి కేశవ, ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు. అనంతరం బద్వేల్ మున్సిపాలిటీ కమలమ్మ కాలనీలో మాదిగలకు కేటాయించిన చర్మకారుల సొసైటీ సర్వేనెం 1580/ బిలో కల 3.64 సెంట్ల భూమి సొసైటీ సభ్యులకు చెందకుండా కొందరు అక్రమార్కులు నిజమైన చర్మ కార్మికులకు అన్యాయం చేస్తున్నారని లెదర్ పరిశ్రమ ద్వారా ఎంతో మందికి ఉపాధి కలుగుతుందని మాదిగల జీవన పాధికోసం ఈ పరిశ్రమ ఎంతగానో ఉపయోగ పడుతుందని, చర్మ కార్మికుల కోసం పోరాడుతుంటే మాపై కూడా దుష్ప్రచారం చేస్తున్నారని సొసైటీకి కేటాయించిన స్థలం గురించి పలు పత్రాలను ఆయనకు చూపించామని ఆయన స్పందించి చర్మకారులకు అన్యాయం జరగకుండా అన్యాకాంతరమైన భూములను రెవెన్యూ అధికారులతో విచారణ చేయిస్తామని చర్మకారుల స్థలం ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సొసైటీ సభ్యులకు న్యాయం జరిగేలా చేస్తామని హామీ ఇచ్చారని అలాగే, లెదర్ పరిశ్రమ రావడానికి, చర్మకారుల కులవృత్తికై కృషి చేస్తానని చెప్పారని బద్వేలు చర్మకారుల సొసైటీ ప్రెసిడెంట్ మున్నిల్లి కేశవ తెలిపారు.

అమ్మఒడితో 25,307మందికి ఆర్థిక ప్రయోజనం

నాలుగో విడత తల్లుల ఖాతాల్లో జమ- ముఖ్యమంత్రికి భాసటగా నిలవాలని 'తుంగా' పిలుపు

విశాలాంధ్ర-యర్రగుంట్ల : రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన అమ్మఒడి నగదు మొత్తాలకు సంబంధించి నియోజకవర్గ వ్యాప్తంగా 25,307 మందికి ఆర్థిక ప్రయోజనం చేకూరింది. జిల్లాకు సంబంధించి 1,80,203 మంది తల్లులకు రూ.15వేల చొప్పున ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరింది. ఈ నేపథ్యంలో స్థానిక పురపాలిక 5వ వార్డు కౌన్సిలర్, సీనియర్ వైసీపీ నేత, ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్ తుంగా వెంకటరామిరెడ్డి తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వరుసగా నాలుగవ యేడాది కూడా అమ్మఒడి పథకాన్ని సకాలంలో వర్తింపచేసిన ఖ్యాతి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుం దన్నారు. విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు వీలుగా విప్లవాత్మక మార్పులు తేవడం జరిగిందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందివ్వాలన్న ఉద్దేశ్యంతో నాడు-నేడు కార్యక్రమం కింద పాఠశాలల్లో అనేక అభివృద్ధి పనులు సాధ్యమయ్యాయని ఆయన గుర్తుచేశారు. తెల్లరేషన్ కార్డు కలిగి ప్రభుత్వ లేదా ప్రైవేటు పాఠశాలల్లో విద్యనభ్యసించే పిల్లలకు అమ్మఒడి పథకం ద్వారా 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు రూ.15వేల చొప్పున సాయం అందిస్తున్న ఘనత ఒక్క వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందివ్వాలన్న ఆశయంతో మెనూలో మార్పులు తేవడం జరిగిందని ఆయన గుర్తుచేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు 2024లో జరగనున్న ఎన్నికలలో తిరిగి వైసీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యేలా సహకరించాలని ఆయన వినతి చేశారు. ఈ సమావేశంలో ఆరవ వార్డు కౌన్సిలర్ నాగిరెడ్డి కూడా పాల్గొన్నారు.

రిమ్స్ సూపరింటెండెంట్‌కి పలువురు శుభాకాంక్షలు

విశాలాంధ్ర-కడప : నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ రమాదేవిని రిమ్స్ డాక్టర్స్, నర్సింగ్ సిబ్బంది, అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది, ప్యారామెడికల్ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నవజాత శిశువుల విభాగం మరియు రిమ్స్‌లోని అన్ని విభాగాలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ సిఎస్ ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు, గ్రేడ్-1నర్సింగ్ సూపరింటెండెంట్ మాధురీలత, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని పాతమార్కెట్‌లో గల శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ నూతన పాలకమండలి చైర్మెన్‌గా సత్యనారాయణ మరియు పాలకమండలి సభ్యులుగా సుంకు కిషోర్‌బాబును నియ మించినందుకు వారు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డిని ఆయన స్వగృహంలో కలిసి ఘనంగా సన్మానించారు. తమకు నియమించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఎప్పటికి ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామని, ఆంజనేయస్వామి దేవాలయంలో చైర్మెన్‌గా నియమించినందుకు ఆనందంగా ఉంద ని సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వరికూ టి ఓబుల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కామిశెట్టిబాబు, వల్లంకొండ మనోహర్, నాగేళ్ల శ్రీనుతో పాటు పెద్దఎత్తున వైకాపా కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయాలు గ్రామాల అభివృద్ధికి నాంది : ఎంపీ

విశాలాంధ్ర-జమ్మలమడుగు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన సచివాల యం వ్యవస్థగ్రామాల అభివృద్ధికి ఎంతగానో ఉపయోగ పడుతుందని ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం మండల పరిధిలోని గొరుగునూరు గ్రామం లో జమ్మలమడుగు శాసనసభ్యులు మూలే సుధీర్ రెడ్డితో కలిసి ఎంపి అవినాష్ రెడ్డి గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాల యం భవనాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సచివాలయ'వార్డు వాలంటరీ వ్యవస్థద్వారా ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందించడంలో ఉపయోగపడుతుందన్నారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు మౌలిక వసతులు అన్ని సమకూర్చడంలో ప్రభుత్వం ముందుంటుందని అన్నారు.అనంతరం ధర్మాపురం గ్రామంలో నూతన వాటర్ ప్లాంట్ ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు అశ్విని ,ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి , మున్సిపల్ చైర్మన్ శివమ్మ ,పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వర్ రెడ్డి ,మలికిరెడ్డి హనుమంత్ రెడ్డి ,వైసిపి నాయకులు ,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ పాలనలో శాంతిభద్రతలు కరవు: టీడీపీ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువయ్యాయని ప్రొద్దుటూరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ ప్రవీణ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. గాయత్రి టవర్స్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ సాక్షాత్తు వైకాపా ఎంపీ ఈ రాష్ట్రంలో ఇంక నేను పెట్టుబడులు పెట్టలేము ,వ్యాపారం చేయలేను ,నేను వేరే రాష్ట్రానికి వలస పోత, నాకు నా కుటుంబానికి మాకే భద్రత లేదని చెప్పే స్థాయికి శాంతి భద్రతలు రాష్ట్రంలో క్షీణించాయన్నారు. అక్కని వేధిస్తే ఆ వేధించిన వ్యక్తులు వాళ్ళ తమ్ముణ్ణి అతి కిరాతకంగా కాల్చి చంపుతా ఉంటే కూడా పోలీసు వ్యవస్థ ఎంత దిగజారి పోయిందో తెలుస్తుం దన్నారు. దీనికి ముఖ్య కారణం రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ వైకాపా నేతల చెప్పుచేతల్లేకి వెళ్లడమే అన్నారు. చంద్రబాబు ప్రొద్దుటూరులో పోలీసు వ్యవస్థ లేదని, ఎస్పీకి పత్రిక ముఖంగా విజ్ఞప్తి చేశారు. రాజుపాలెంలో ఇసుక మాఫియా ఇసుకను తరలిస్తూ ట్రాక్టర్ తగిలిస్తే మహిళ ప్రాణాలు కోల్పోయిందన్నారు. కడపలో సిసి కెమెరాలు లేకపోయి ఉంటే, జరిగిన హత్యలో పదిమంది టీడీపీ నాయకులపై కేసులు పెట్టి ఇరికించేవారున్నారు. వైకాపా నాయకులు చెప్పే విధంగా నడుచుకోలేక అధికారులు ప్రొద్దుటూరుకు రావడం లేదన్నారు. ప్రొద్దుటూరుపై జిల్లా ఎస్పీ, డి.ఎస్.పి దృష్టి సాధించాలని కోరారు.

ఇంటర్ విద్యార్థికి చేయూత

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : ఒంటిమిట్ట మండలం కొండమాచు పల్లెలో వున్న యస్.బి. ఆర్.యస్ కాలేజీలో ఇంటర్మీడియట్ మ్నొదటి సంవత్సరం చదువుతున్న నిరుపేద కుటుంబానికి చెందిన బోగా నవీన్ అనే విద్యార్థికి మనఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థ మరియూ డొక్కా సీతమ్మ సేవా సంస్థల ఆధ్వర్యంలో ఇంటర్ చదువుతున్న బోగా నవీన్ అనే యువకుడు చదువుకునేందుకు పుస్తకాలకు ఫీజులకు గాను దాతలు మాడా బాలాజీ మరియూ కీ.శే వాకాటి వెంకట నరసయ్య కుమారుడు నరసింహా స్వామి ఆర్థిక సహకారంతో విద్యార్థి పుస్తకాలకు ఫీజులకు కలిపి రూ.12000 లు కాలేజీలో కట్టి విద్యార్థి ఖర్చుల నిమిత్తం 1000 రూపాయలు నగదును అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మనఊరి కోసం స్వచ్ఛంద సంస్థ చైర్మన్ అవ్వారు రవిశంకర్, డొక్కా సీతమ్మ చైర్మన్ పుత్తా సుధీర్ రాయల్, ఉప్పల రామక్రిష్ణ యస్.బి.ఆర్.యస్ కాలేజీ ప్రిన్సిపాల్ మండూరు జయలక్ష్మి పాల్గొన్నారు.

విశాలాంధ్ర



అన్నమయ్య జిల్లా

రాజన్న రాజ్యం జగనన్నతో సాధ్యం : ఎంపీ మిథున్ రెడ్డి

విశాలాంధ్ర-గుర్రంకొండ: రాజన్న రాజ్యం జగనన్నతోనే సాధ్యమని రాజంపేట పార్లమెంట్ సభ్యులు ఎంపీ మిథున్ రెడ్డి పీలేరు శాసనసభ్యులు చింతల రామచంద్ర రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గుర్రంకొండ మండలం నడిమికండ్రిక గ్రామంలో గడపగడప కార్యక్రమాన్ని నిర్వహించారు గ్రామ సచివాలయం ఆర్ బి కే కేంద్రాలను శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను వాలంటీర్ల వ్యవస్థతో ప్రతి ఇంటికి చేరవేస్తున్నారని గ్రామాలలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం ప్రజలు నుంచి స్వీకరించిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. గడప గడప కార్యక్రమంలో గ్రామ అభివృద్ధికి కావలసిన నిధులను మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో హరీష్ రెడ్డి ఆర్బికే చైర్మన్ జయచంద్ర రెడ్డి మండల ప్రత్యేక ఆహ్వానితులు యోగేంద్ర రాష్ట్ర వైఎస్ఆర్సిపి సెక్రెటరీ ఆగామహుద్దీన్, జడ్పిటిసి ముక్తియాసమ్రిన్ మాజీ ఎంపీపీ నక్క చంద్రశేఖర్ హౌస్ ఫర్ చైర్మన్ నక్క గోపి మండల వైఎస్ఆర్సిపి నాయకుడు సుధీర్ ,రెడ్డి భాష క్రిస్టియన్ ఫాదర్ జాన్ బాబు సచివాల కన్వీనర్ నాగేంద్ర కుమార్ ఎంపీటీసీ రాజగోపాల్ రెడ్డి కుమార్ కదిరుల్ల నాని శివశంకర్ గ్రామ ప్రజలు అధికారులు పాల్గొన్నారు.

ఐకమత్యానికి, త్యాగానికి ప్రతిరూపం బక్రీద్:సుగవాసి ప్రసాద్ బాబు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:త్యాగం,సహనం, ఐకమత్యానికి ప్రతీకగా బక్రీద్ నిలుస్తోందని మాజీ టీటీడీ పాలకమండలి సభ్యులు రాయచోటి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు అన్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం స్ఫూర్తితో ప్రజలు సత్యం, న్యాయం,ధర్మం, త్యాగం, సహనం, పరోపకారం, బాధ్యతాభావం అలవరచుకోవాలని ఆయన కోరారు. దేవుడి దయతో ప్రజలందరూ ఆరోగ్యాలు, సుఖ సతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలందరికీ అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గ ముస్లిం సోదరులకు సుగవాసి ప్రసాద్ బాబు గారు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

జూలై 3 నుండి వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు: చైర్మన్

విశాలాంధ్ర- రైల్వేకోడూరు : మండల కేంద్రంలోని ధర్మాపురం సమీపంలోని పసుపు మండీల వద్ద వెలసిన శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో 3 జూలై నుండి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహిస్తున్నామని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ చైర్మన్ నీలపూజ రత్నాచారి పేర్కొన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా వీరబ్రహ్మేంద్రస్వామి వారికి, కాశీ విశ్వేశ్వరస్వామికి పంచామృతాభిషేకం, హోమం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి ప్రసాద వినియోగం సాయంత్రం పల్లకి సేవ తదితర కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరుగుతాయని చైర్మన్ తెలిపారు. భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ధన్యులు కావాలని కోరారు.

జూనియర్ కళాశాల మంజూరు కావడం హర్షదాయకం

వైస్ ఎంపీపీ యదుభూషన్ రెడ్డి

విశాలాంధ్ర-గాలివీడు: మండలానికి జూనియర్ కళాశాల మంజూరు కావడం హర్షదాయకం అని వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలకేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో విద్యార్థులతో కలసి కేకు కట్ చేసి పంచిపెట్టారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలివీడు మండలానికి జూనియర్ కళాశాల మంజూరు కావడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థుల దశాబ్దాల కల నెరవేరిందన్నారు.కళాశాల మంజూరు చేయించడానికి కృషి చేసిన ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డికి విద్యార్థులు,తల్లిదండ్రులు,మండల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.విద్యార్థులకు సౌకర్యవంతంగా మండలకేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు గదుల్లో 2023-24 ఈ విద్యాసంవత్సరం నుంచే తరగతులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఎంపిసీ,బైపిసీ, సీఈసీ,హెచ్ఈసీ గ్రూపుల్లో విద్యార్థిని,విద్యార్థులకు అడ్మిషన్లు పొందవచ్చన్నారు.విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు ఆవుల నాగభూషన్ రెడ్డి,మండల మైనారిటీ నాయకులు ఎస్. ఖాదర్ మొహిద్దీన్,మాజీ వైస్ ఎంపీపీ రమేష్ రెడ్డి,నులివీడు సర్పంచ్ ఉమాపతి రెడ్డి,పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాయి తేజ నాయక్‌ను విధుల నుంచి తొలగించాలి: ఏఐటియుసి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : ఆశా కార్యకర్తల పట్ల అసభ్యంగా రౌడీగా ప్రవర్తించిన మదనపల్లి అర్బన్ రామారావు కాలనీ మెడికల్ ఆఫీసర్ గా పని చేస్తున్న సాయితేజనాయక్ ను తక్షణం విధుల నుండి తొలగించి న్యాయ విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు మాదరాజు గంగాధర్ డిమాండ్ చేశారు. బుధవారం ఏఐటియుసి కార్యాలయంలో పాత్రికేయులు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు తక్కువ వేతనంతో ఎక్కువ విధులు నిర్వహించి వివిధ రకాల సర్వేలు నిర్వహించారన్నారు. ఆ సర్వేలకు సంబంధించిన బిల్లులను జిల్లా మెడికల్ అధికారులను అడిగినందుకు సాయితేజనాయక్ ఆశా కార్యకర్తలను పిలిపించి మహిళలని కూడ చూడకుండా అసభ్యంగా బెదిరించి మాట్లాడడం తగదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్నమయ్య జిల్లా కలెక్టర్ స్పందించి మెడికల్ ఆఫీసర్ సాయితేజనాయక్ పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకొని ఎడల అన్నమయ్య జిల్లాలోని అన్ని ప్రాంతాలలో ప్రాథమిక వైద్యఆరోగ్య కేంద్రాల వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

50వేల రూపాయలు అందించిన ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : మండల కేంద్రం మేజర్ గ్రామ పంచాయతీలోని కొత్త కోడూరులోని శ్రీశ్రీశ్రీ ఆది శంకరాచార్యులు వారి మఠం నిర్మాణం కోసం ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ ముక్కారూపానంద రెడ్డి తనయుడు యంగ్ డైనమిక్ లీడర్ ముక్క సాయివికాస్ రెడ్డి బుధవారం సాయంత్రం కోడూరు టౌన్ లోని శ్రీ భుజంగేశ్వరస్వామి ఆలయం వద్ద బ్రాహ్మణ సేవా సంఘ సభ్యుల సమక్షంలో 50 వేల రూపాయలు చెక్ బ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్షులు చిందుకూరు నరసింహాశర్మకి అందజేసి భక్తిని చాటుకున్నారు. సహాయం అందించిన ఆలయాల నిర్మాణ దాతలు ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ ముక్కా రూపానందరెడ్డికి, తనయుడు ముక్కా సాయివికాస్ రెడ్డిలకు బ్రాహ్మణ సేవా సంఘం తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. బ్రాహ్మణ సేవా సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ముక్కా సాయివికాస్ రెడ్డికి శాలువా కప్పి పూలమాలు వేసి ఘనంగా సన్మానించి అతనిలో ఉత్సాహాన్ని నింపి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బత్తిన వేణుగోపాల్ రెడ్డి, సురేష్ కుమార్ శర్మ, రామ్మోహన్ శర్మ, పవన్ కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే పీడీ యాక్ట్:డిఎస్పీ

విశాలాంధ్ర-మదనపల్లి : బక్రీద్ రోజు అల్లర్లకు పాల్పడితే పీడీ యాక్ట్ పెట్టాల్సి వస్తుందని మదనపల్లె డీఎస్పీ కేశప్ప హెచ్చరించారు. మదనపల్లెలో ఏపీఎస్పీ బెటాలియన్, సివిల్ పోలీసులు బుధవారం పురావీధుల్లో కవాతు నిర్వహించారు. బక్రీదు ప్రశాంత వాతావరణంలో జరిగేలా బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. చట్టవ్యతిరేక కార్యాకలాపాలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముస్లింలు ప్రశాంత వాతావర ణంలో జరుపుకోవాలన్నారు అన్నమయ్య జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మదనపల్లి పట్టణంలో బెంగుళూరు బస్టాండు నుండి దకినీపేట.ఆర్ఆర్ స్ట్రీట్.చిత్తూరు బస్టాండు.టౌన్ బ్యాంక్ సర్కిల్.సీటీఎం రోడ్డు.అంబేద్కర్ సర్కిల్.మెట్రో సర్కిల్.ఇంద్రానగర్.ఎన్టీఆర్ సర్కిల్.అని బీసెంట్ సర్కిల్.బెంగుళూరు రోడ్డు వరకు సబ్ డివిజనల్ పోలీసులు మరియు ఏపీఎస్పీ బెటాలియన్ పోలీస్ సిబ్బందితో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఫ్లాగ్ మార్చ్ లో మదనపల్లి వన్ టౌన్ సీఐ మహబూబ్ బాషా, తాలూకా సిఐ శ్రీ సత్యనారాయణ, ట్రాఫిక్ సిఐ కృష్ణయ్య ఎస్సైలు హరిహర ప్రసాద్ మధు స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు

మనిషి తలరాతను మార్చడం చదువుకే సాధ్యం:జెసి

నాలుగో విడత అమ్మఒడి కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: మనిషి తలరాతను మార్చడానికి ఒక చదువుకు మాత్రమే సాధ్యమౌతుందని తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్ విజ్ఞప్తి చేశారు. బుధవారం ముఖ్యమంత్రి కురుపాంలో అమ్మ ఒడి కార్యక్రమం ద్వారా 2022-23 విద్యా సంవత్సరానికి గాను ఒకటో తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న 42,61,965 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.6,392.94 కోట్ల రూపాయలను జమచేశారు. అన్నమయ్య జిల్లా వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ భాష, డీఈవో పురుషోత్తం, డిప్యూటీ డిఇఓ వరలక్ష్మి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, తల్లులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ చదువుకు పేదరికం ఎప్పుడూ ఆటంకం కాకూడదన్న గొప్ప ఆలోచనతో ముఖ్యమంత్రి అమ్మ ఒడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నరు. ఈ క్రమంలో నాలుగో ఏడాది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ చేశారన్నారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా అర్హత కలిగిన తల్లులకు ఒక్కొక్కరికి రూ.15,000 వేలు చొప్పున 1,52,366 మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలో రూ.225.55 కోట్ల రూపాయల మొత్తాన్ని నేరుగా జమ చేయడం జరిగిందన్నారు. పేద విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్య అందించడంతో పాటు ప్రతి బడి ఈడు పిల్లవాడు బడిలోనే ఉండాలని వారి భవిష్యత్తుకు భరోసా కల్పిస్తు జగనన్న అమ్మ ఒడి కార్యక్రమం ద్వారా వరుసగా నాలుగో ఏడాది అమ్మ ఒడి నిధులు తల్లుల ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. విద్యాభివృద్ధి చెందుతే రాష్ట్రం దేశం అభివృద్ధి చెందుతుందన్న ఉద్దేశంతో ప్రభుత్వం విద్య పైన ప్రత్యేక దృష్టి పెట్టి విద్యా రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందన్నారు.

మెగా చెక్కు అందజేత:

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా అర్హత కలిగిన తల్లులకు ఒక్కొక్కరికి రూ.15,000 వేలు చొప్పున 1,52,366 మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలో రూ.228,54,90,000 మొత్తాన్నికి సంబంధించి మెగా చెక్కును విద్యార్థుల తల్లులకు ముఖ్య అతిథులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

ప్రజల సంక్షేమమే గడప గడపకు మన ప్రభుత్వం లక్ష్యం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : ప్రజల సంక్షేమమే గడప గడపకు మన ప్రభుత్వం లక్ష్యం అని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు.బుధవారం అనంతరాజుపేట పంచాయితీ పరిధిలోని గ్రామసచివాలయం-2 పరిధిలోని నారాయణరాజుపోడు, మిట్టమీదిపల్లి,ఎస్సీ తదితర ప్రాంతాలలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ అభివృద్ధి ఫలాలు తోపాటు ప్రజాసమస్యలకు సంతృప్తి స్థాయిలో పరిష్కారం చూపడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు.ఇంటింటికి వెళ్లి అప్యాయంగా పలకరించి జగనన్న పథకాలకు సంబంధించిన బుక్ లెట్ అందజేసి వారిలో చైతన్యం తీసుకువచ్చారు.మనం అందరం జగనన్న రుణం తీర్చుకోవాలని కోరారు.అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్దలూరు సుబ్బరామరాజు,వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, జడ్పిటిసి పాలెంకోట రత్నమ్మ, డిప్యూటీ తాసిల్దారు అమరేశ్వరి, ఎంపిడిఓ జాషువా, ఎంపిటిసి లు బండారు మల్లికార్జున, పందేటి జనార్దన్ రాజు, బొజ్జావారిపల్లి ఉపసర్పంచ్ యూత్ వింగ్ కన్వీనర్ దాడిశెట్టి సిద్ధూ, మైనార్టీ నాయకులు ఇఫ్రాన్ నవాబ్,వైసిపి నాయకులు తొండం రాజేంద్ర,ఎపిఎం రవికుమార్,ఎపిఓ ఉమమహేశ్వరరావు, ముద్దపోలు నారాయణ,ఎదుక అంజి, తుమ్మల మత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌ను రద్దు చేయాలని సబ్ కలెక్టర్‌కు వినతి

విశాలాంధ్ర -సుండుపల్లె : సుండుపల్లె రాయవరంలో ఇసుక రీచ్ ను ఎటువంటి పరిస్థితుల్లో అనుమతించవద్దని జిల్లా కలెక్టరేట్ లో సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో అనేక ఇబ్బందులకు ఇసుక రీచ్‌ని ఎటువంటి లిఖిత పూర్వక ఆదేశాలు లేకపోయినా తహసీల్దార్ రీచ్ ఏర్పాటు చేస్తానని తెలిపినట్లు వివరించారు. గతంలో అనుమతులు ఇచ్చి రీచ్‌ను నడిపిన సమయంలో పరిమితికి మించి ఇసుకను అక్రమంగా తరలించి పెద్ద పెద్ద గోతులు ఏర్పడగా దానిలో పడి చిన్న పిల్లలు, పశువులు అనేక ప్రమాదాలు గురి అయ్యాయని, ప్రాణాపాయం స్థితికి చేరుకున్న సంఘటన అనేక ఉన్నాయని, ఇప్పటికైనా తమపై దయవుంచి ఇసుక రీచ్‌ని మళ్లీ పున: ప్రారంభించకుండా చర్యలు తీసుకోవాలని వారు తెలిపారు.

ఏకాగ్రతతో చదివితే ఉజ్వల భవిష్యత్తు



విశాలాంధ్ర -లక్కిరెడ్డిపల్లి : ఏకాగ్రతతో చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఈఓ చక్రనాయక్ పేర్కొన్నారు. బుధవారం ఏపీ మోడల్ స్కూల్లో ఆయన విద్యార్థులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమం పేద విద్యార్థులకు వరము లాంటిదని ప్రతి ఒక్కరూ దీని షెడ్యూల్ చేసుకోవాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరికి జెవికెట్లు అందాయా లేదని పిల్లడికి తెలుసుకున్నారు. 10వ తరగతిలో ప్రతి ఏటా ఏపీ మోడల్ స్కూల్ మండల స్థాయిలో ఎంపికవుతోందని ఈ ఏడాది ఏపీ మోడల్ స్కూల్ మండల స్థాయి జిల్లా స్థాయి మూడో స్థానంలో నిలిచిందని ట్రిబుల్ ఐటీ కి ఈ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ఆయన కొనియాడారు. ఎం ఈ ఓ 2 వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ గణితం పై ప్రత్యేక దృష్టి పెట్టి మంచి ఉజ్వల భవిష్యత్తు అధిరోహించాలని ఆయన తెలియజేశారు. నైతిక విలువలు విద్యా ప్రమాణాలు విద్యార్థికి ముఖ్య లక్షణాలని వీటిని ఆచరిస్తే భవిష్యత్తులో మంచి ప్రయోజకులవుతారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివ శంకర్ రెడ్డి వైస్ ప్రిన్సిపల్ రాజ్ కుమార్ అధ్యాపకులు జగ్రముద్వేగం, శ్రీక,ల విజయ, విజయ కుమారి శ్రీనివాసులు సుధాకర్ నిత్య పూజయ్య రాజేశ్వరి, అరుణ్ కుమారి, భారతి, ప్రసాద్ ,సోమశేఖర్ నాయక్ సుధీర్ కుమార్ ఉమా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయంగా సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-పీలేరు: పేదల సంక్షేమమే ధ్యేయంగా వైసీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేటట్లు చేస్తున్న ఏకైక ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వమేనని ప్రముఖ యువ పారిశ్రామికవేత్త వైయస్సార్సీపి నాయకులు జీవి రాకేష్ రెడ్డి అన్నారు. ఆయన స్థానికంగా చిత్తూరు రోడ్డు, బాపూజీ నగర్ పలు ప్రాంతాలలో అలాగే ఆయా వార్డులలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించడంతో పాటు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా బాపూజీ నగర్ లో రెండు లక్షల రూపాయల బోరును కొత్తగా మోటార్ ను ఏర్పాటు చేసి ప్రారంభించారు. గతంలో ఎన్నడు లేని విధంగా ప్రజల అభీష్టం మేరకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని ఆయన ఉద్ఘాటించారు. ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం వివిధ పథకాలను ప్రవేశపెట్టి దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అగ్రగామిక ముందుకు తీసుకెళుతున్నారని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీలేరు ఎంపీపీ కంభం సతీష్ రెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్ భాషా, మండల కన్వీనర్ దండు జగన్మోహన్ రెడ్డి,ఎంపీటీసీ నరసింహారెడ్డి, వైసీపీ నాయకులు జయ చంద్రారెడ్డి,కృష్ణారెడ్డి, రెడ్డి బాషా,ఉదయ్ కుమార్, షాకీర్,నరేష్ రామ్ కుమార్ రెడ్డి, కాలనీ చిన్న, ఎం అరుణ, వార్డు సభ్యులు, వైయస్ఆర్సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వర్సెస్ కౌన్సిలర్

ఎమ్మెల్యేకు చెక్ పెట్టకపోతే పార్టీకి తీవ్ర నష్టం తప్పదు
తీవ్ర అసహనం వ్యక్తం చేసిన అధికార పార్టీ కౌన్సిలర్ ప్రసాద్ బాబు

విశాలాంధ్ర -మదనపల్లి : అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే నవాజ్ బాషా మున్సిపల్ కౌన్సిలర్ ప్రసాద్ బాబు మధ్య విభేదాలు భగ్గుమన్నాయి.దళితుడనే చిన్న చూపు చూస్తూ తన వార్డ్ అభివృద్ధి కి చైనా వాల్ లాగా తయ్యారు అయ్యాడని అధికార పార్టీ కౌన్సిలర్ ప్రసాద్ బాబు ఆరోపించారు.. ఎమ్మెల్యే నవాజ్ భాషకు చెక్ పెట్టకపోతే పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతుందని పార్టీ అధిష్టానం ఈ విషయాన్ని గమనించాలని ఆయన సూచించారు.వార్డ్ ప్రజలతో కలిసి పట్టణంలోని గొల్లపల్లి సర్కిల్లో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఎమ్మెల్యే నవాజ్ భాష డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.అసమర్ధ ఎమ్మెల్యే రాజీనామా చెయ్యాలంటు రోడ్డు పైకి వచ్చి ఆగ్రహించారు..అనంతరం కౌన్సిలర్ ప్రసాద్ బాబు విలేకరులతో మాట్లాడారు ఎమ్మెల్యే స్థాయిలో ఉంటూ తాను దళితుడనే చిన్న చూపు చూడడం ఎమ్మెల్యే నవాజ్ బాషా కు తగునా అన్నారు..వార్డ్ కు సంబంధించి వాటర్ ట్యాంక్, మురికి కాలువలు నిర్మాణం,తారు రోడ్లు వంటి అభివృద్ధి పనులు చేపట్టాలని పలు మార్లు అడిగిన ఎమ్మెల్యే గా స్పందించలేదు..తన వార్డ్ లో భాగమైన గొల్లపల్లి సర్కిల్ చౌడేశ్వరి దేవి ఆలయం వరకు వేసిన తారు రోడ్డు ప్రారంభోత్సవానికి పిలవకుండా అవమానించారు..కమిషనర్ ప్రమీల దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే చెప్తే చేస్తానని బిస్మించి కూర్చోవడం పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు.. దళితుడు అయిన తనపై అక్కసు కక్కుతూ దాడులు చేయించే కార్యక్రమాలు చెపడుతున్నాడు..ఎస్సి అని విర్ర వీగుతున్నవా తొక్కేస్తా ,కాలరాస్తా అంటూ సహచర కౌన్సిలర్లు, చైర్ పర్సన్, ప్రజలు,అధికారుల సమక్షంలో ఎమ్మెల్యే అసభ్యంగా తిట్టి అవమానించాడు.పార్టీ ఆవిర్భావం నుంచి జెండా మోసం ని లాగా జెండా మోయ్యకుండా రాలేదు అంటు ఎమ్మెల్యే కు చురకలు అంటించాడు. దళితుల పట్ల వివక్ష చూపిస్తూ అవమానించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశాడు.. ఓట్లేసి గెలిపించిన ప్రజలకు తాను ఏమని సమాధానం చెప్పాలని అభివృద్ధికి అడ్డుపడుతున్న ఎమ్మెల్యే నవాజ్ బాషా త్వరలో చెల్లించు కుంటాడని హెచ్చరించాడు. నాకు ఎమ్మెల్యే దేవుడు రాజకీయ భిక్ష పెట్టిన మహానుభావుడు అని ఎమ్మెల్యే కు భజన మానుకుని కౌన్సిలర్ గా గెలవడానికి తన భిక్ష వల్లే అనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని కౌన్సిలర్ రేణుక కు సూచించారు.తాను రాజకీయ లబ్ధి కోసం ఎమ్మెల్యే పై మాట్లాడలేదని తనకు ఓట్లు వేసి గెలిపించిన ప్రజల కోసం జాతి కోసం తన గళాన్ని వినిపిస్తున్నట్లు తెలిపాడు. ఎమ్మెల్యే తీరు ను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎంపీ మిధున్ రెడ్డిల దృష్టికి తీసుకెళ్లిన సర్దుకుపోవాలని సూచించినట్లు ఆయన తెలిపారు.. అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు సర్పంచులు ఎంపీటీసీలు వార్డు సభ్యులు ప్రజలు ఎమ్మెల్యే తీరు నచ్చక పార్టీకి దూరంగా ఉంటున్నారని పార్టీ అధిష్టానం ఇకనైనా స్పందించి నియంతల వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే తీరుకు చెక్ పెట్టాలని ఆయన కోరారు.. నియంత లా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్ భాషకు మరోసారి టికెట్ కన్ఫామ్ చేస్తే నియోజక వర్గంలో డిపాజిట్ కూడా రాదని ఆయన జోస్యం చెప్పారు. సొంత పార్టీకి చెందిన నాయకులే అతన్ని ఓడిస్తారనే విషయం పార్టీ అధిష్టానం గుర్తుపెట్టుకోవాలని ఆయన సూచించారు.శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న వార్డు ప్రజలు,కౌన్సిలర్ ప్రసాద్ బాబు ,పోలీసుల మధ్య కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది డిఎస్పీ కేశప్ప కౌన్సిలర్ ప్రసాద్ బాబుకు నచ్చచెప్పడంతో రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు నిరసనను విరమించారు. ఈ నిరసన కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రసాద్ బాబు, కొండుపల్లి ఆనంద్‌లతో పాటు వార్డ్ ప్రజలు పాల్గొన్నారు.

జిల్లా అదనపు కోర్టు పీపీగా రఫీ అన్సారి

విశాలాంధ్ర-పీలేరు: పీలేరు కు చెందిన ప్రముఖ న్యాయవాది రఫీ అన్సారిని 11వ అదనపు జిల్లా జడ్జి కోర్టు ఇన్చార్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు రఫీ అన్సారీ తెలిపారు. న్యాయవాది రఫీ అన్సారి ప్రస్తుతం పీలేరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు పీపీగా విధులు నిర్వహిస్తున్నారు. అదనపు జిల్లా జడ్జి కోర్టు పీపీగా నియమితులైన సందర్భంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, సీనియర్ పాత్రికేయుడు పఠాన్ జాకీర్ హుస్సేన్ ఆయనను సాలువతో సత్కరించారు. అలాగే పలువురు సహ న్యాయవాదులు తదితరులు అభినందించారు.

బియ్యం స్కామ్‌లో నిందితుని అరెస్ట్

విశాలాంధ్ర-మదనపల్లి : తంబళ్లపల్లి బియ్యం గోడౌన్లో ఆరు నెలలు క్రితం పేదలకు అందించాల్సిన పిడిఎస్ బియ్యం, చక్కర, తదితర నిత్యావసర సరుకులను దారి మళ్లించి గుట్టు చప్పుడు కాకుండా బ్లాక్ మార్కెట్లో డిటి హరి ప్రసాద్, డీఈఓ రూ.4.60 కోట్ల బియ్యం స్కాంకు పాల్పడ్డ నిందితుడు తంబళ్లపల్లి పౌర సరఫరాల బియ్యం గోడౌన్ డిప్యూటీ తహసీల్దార్ హరిప్రసాద్‌ను బుధవారం మదనపల్లి డిఎస్పీ కేశప్ప, సీఐ షాదిక్ ఆలీ అరెస్టుచేశారు. డిఎస్పీ కథనం మేరకు తంబళ్లపల్లి డిప్యూటీ తహసిల్దార్ హరిప్రసాద్, ఇంచార్జి డీటీఓ సదాశివలు పేదలబియ్యం దారి మళ్లించి బ్లాక్ లో అమ్మేశారని తేలడంతో అరెస్టు చేశామని డిఎస్పీ తెలిపారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్: శ్రీకాంత్ రెడ్డి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: త్యాగం, సహనం, ఐకమత్యానికి ప్రతీకగా బక్రీద్ నిలుస్తోందని వైఎస్ఆర్ సిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం స్ఫూర్తితో ప్రజలు సత్యం, న్యాయం, ధర్మం, త్యాగం, సహనం, పరోపకారం, బాధ్యతా భావం అలవరచుకోవాలని ఆయన కోరారు. దేవుడి దయతో ప్రజలందరూ ఆరోగ్యాలు, సుఖ శాంతులతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలందరికీ అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లాలో ఎల్ల ప్పుడూ మత సామరస్యం వెల్లివిరియా లన్నారు.ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు శ్రీకాంత్ రెడ్డి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

మదనపల్లిలో అస్సాం పోలీసుల ఆరా

ప్రేమ జంటను వెంట తీసుకు వెళ్లిన వైనం

విశాలాంధ్ర-మదనపల్లి : మదనపల్లికి అస్సాం పోలీసులు రావడం కలకలం రేపింది. అస్సాం నుంచి వచ్చిన మైనర్ ప్రేమ జంటను సోమవారం అదుపులోకి తీసుకుని రూరల్ పోలీస్ స్టేషన్‌లో ప్రశ్నించారు. ఇటీవల అస్సాం రాష్ట్రంలోని ఓ పట్టణానికి చెందిన ప్రముఖుడి కుమార్తె మదనపల్లి ప్రాంతానికి చెందిన యువకుడితో ప్రేమలో పడి వచ్చేసినట్లు గుర్తించారు. దీంతో అస్సాం పోలీసులు మదనపల్లికి వచ్చిన ప్రేమ జంటను అస్సాం తీసుకెళ్లారు.

వెంకటరమణ భౌతికకాయానికి సుగవాసి నివాళులు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: చిన్నమండెం మండలం కొండమూల లో బుదవారం కొరముట్ల వెంకట రమణ మరణించిన విషయం తెలిసి మాజీ టీటీడీ పాలకమండలి సభ్యులు, రాయచోటి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబు విచ్చేసి భౌతికకాయానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రసాద్‌బావు వెంట బొమ్మిశెట్టి నారయణ, లక్షుమయ్య, రామయ్య, రామచంద్ర, మాజీ సర్పంచ్ మల్లికార్జున, సుగవాసి శ్రీనివాసులు, తెలుగు యువత మండల అధ్యక్షుడు తౌహీద్ ఖాన్, బడిశెట్టి రవి, కెసి ప్రసాద్, ముని, మన్నేరు రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

టిడిపి నేత చమర్తి జగన్ రాజు

విశాలాంధ్ర -రాజంపేట : త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగని ప్రముఖ విద్యావేత్త, తెలుగుదేశం పార్టీ రాజంపేట నియోజకవర్గ సీనియర్ నేత చమర్తి జగన్ రాజు అన్నారు. గురువారం బక్రీద్ పండుగ సందర్భంగా ఆయన ముస్లీం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. భక్తిశ్రద్ధలతో ముస్లిం సోదరులు కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు.

వేరుశనగ పంటకు విత్తనశుద్ధి తప్పనిసరి

జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్

విశాలాంధ్ర-గాలివీడు:వేరుశనగ పంటకు విత్తనం వేసే సమయంలో తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ పేర్కొన్నారు.బుధవారం మండలంలోని వెలిగల్లు గ్రామ రైతుభరోసా కేంద్రంలో వేరుశనగ రైతులకు శిక్షణాకార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పాటించాల్సిన విత్తనశుద్ధి,యాజమాన్య పద్ధతులు,సస్యరక్షణ చర్యలు,ఎరువులు, క్రిమి సంహారక మందుల వాడకంపై అవగాహన కల్పించారు.అంతేగాక భూసార పరీక్షలు కూడా నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మురళీధర్,గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ,విఎఏ రమేష్ రెడ్డి,గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రైవేటు బ్యాంకు సిబ్బంది వ్యక్తిపై దాడి

విశాలాంధ్ర-పీలేరు: పీలేరు పట్టణంలోని ఓ ప్రైవేటు బ్యాంకు సిబ్బంది వ్యక్తిపై దాడి చేసిన సంఘటన పీలేరులో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.పీలేరు పట్టణంలోని పద్మావతి నగర్ కు చెందిన వినోద్ కుమార్ (30)పట్టణంలోని ఓ ప్రైవేట్ బ్యాంకు వద్ద టీవీ కొనుగోలు కోసం 21 వేల రూపాయలు ఫైనాన్స్ తీసుకున్నారు. క్రమ పద్ధతి ప్రకారంగా ఆరు నెలలు వాయిదాల పద్ధతి ప్రకారం చెల్లిస్తూ వచ్చారు. ఏడవ నెల చెల్లింపు పై ఒకరోజు గడువు చెప్పడం జరగడంతో ప్రైవేట్ బ్యాంకు కు సంబంధించిన ముగ్గురు సిబ్బంది వినోద్ కుమార్ మరియు బ్యాంకు సిబ్బంది మధ్య వాదోపవాదాలు జరిగి వినోద్ కుమార్ పై దాడి చేయడంతోబలమైన గాయలు అయినాయి అతనిని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ మేరకు వినోద్ కుమార్ పీలేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

శుభాకాంక్షలు తెలిపిన యర్రపురెడ్డి అజయ్ రెడ్డి

విశాలాంధ్ర-సుండుపల్లి : విశాలాంధ్ర అన్నమయ్య జిల్లా సుండుపల్లె త్యాగం, సహనం, ఐకమత్యానికి ప్రతీకగా బక్రీద్ నిలుస్తోందని వైఎస్ఆర్ సిపి అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గ నాయకులు యర్రపురెడ్డి అజయ్‌రెడ్డి అన్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం స్ఫూర్తితో ప్రజలు సత్యం, న్యాయం, ధర్మం, త్యాగం, సహనం, పరోపకారం, బాధ్యతాభావం అలవరచుకోవాలని ఆయన కోరారు. దేవుడి దయతో ప్రజలందరూ ఆరోగ్యాలు, సుఖ శాంతులుతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలందరికీ అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లాలో ఎల్లప్పుడూ మత సామరస్యం వెల్లివిరియాలన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు యర్రపురెడ్డి అజయ్ రెడ్డి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.